


ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

ఆర్టీసీ బస్సులు కళకళలాడుతున్నాయి. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల తాకిడి పెరగడంతోపాటు ఆదాయం సమకూరుతోంది. 10లో▸



గుట్టపై వరాల తల్లి

కౌటాల సమీపంలోని కంకలమ్మ ఆలయం లో ఆగస్టు 4న బోనాల జాతర నిర్వహించ నున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
31.5 /26.5

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



వంటలు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని హట్టి, అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, విద్యాబోధనపై ఆరా తీశారు. మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని, వంట గదితోపాటు స్టోర్ రూం, మరుగుదొడ్లు నిత్యం శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. విధులు సక్రమంగా నిర్వహించని అనార్‌పల్లి హెచ్‌ఎం బలిరాంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కెరమెరి పీహెచ్‌సీని సందర్శించారు. త్వరలోనే సిబ్బందిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమం వివరాలు తెలుసుకున్నారు.

తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలపై దృష్టి

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో తీవ్ర పోషకాహార లోపంతో బాధపడే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ వారి సమన్వయంతో పర్యవేక్షణతో కూడిన అనుబంధ ఆహారం(ఎస్‌ఎస్‌ఎఫ్‌పీ)పై మంగళవారం సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలకు ఒక రోజు శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పోషకాహారం అందించి వారి ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. మానసిక, శారీరక ఎదుగుదల లోపించిన వారిని గుర్తించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అనుబంధ ఆహార విభాగం సమన్వయకర్తలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారి, రేషదేశాయ్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీ కులాలకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కులగణన ప్రారంభించాలనే డిమాండ్‌తో బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో కులగణన చేపట్టి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం బీసీలకు ఉన్న రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంతోపాటు గొల్లకుర్మలకు వందరోజుల్లో రెండో దశ గొర్రెల పంపిణీ, జ్యోతిబా పూలే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.20వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. హామీలన్నీ నెరవేర్చడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, నాయకులు ఖాండ్రె విశాల్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: బ్యాంకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు టాస్క్ రీజినల్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 5 నుంచి టాస్క్ ఆధ్వర్యంలో బ్యాంకు సంబంధిత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్, మొబైల్ నం.95027 86438లో సంప్రదించాలని సూచించారు.

బురదే మిగిలింది..!

చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన డగె అంకులు ఏడెకరాల్లో పత్తి సాగు చేస్తున్నాడు. ఎకరానికి సుమారుగా రూ.20వేల చొప్పున పెట్టుబడి పెట్టాడు. గ్రామ సమీపంలోని వాగు వరదలతోపాటు ప్రాణహిత నది నీటిలో పంట మునిగింది. వారం రోజులకు పైగా వరద ఉండడంతో మొక్కలు కుళ్లిపోయాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో పత్తి రైతులందరిదీ ఇదే పరిస్థితి.





బెజ్జూర్ మండలంలో బురదమయంగా మారిన పంట పొలాలు

- ప్రాణహిత ఉప్పొంగడంతో వేల ఎకరాల్లో పంట నష్టం
- బురద, ఇసుక మేటలతో పత్తి చేలు
- రోజుల తరబడి వరద నిలవడంతో కుళ్లిన మొక్కలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



చింతలమానెపల్లి మండలం దిందా శివారులో కుళ్లిన పత్తి మొక్కలు

బెజ్జూర్/చింతలమానెపల్లి: జిల్లాలో ఏకధాటిగా కురిసిన వర్షాలకు తోడు మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల నుంచి వస్తున్న వరదతో ప్రాణహిత నది వర్షాకాలం ఆరంభంలోనే ఉప్పొంగింది. కోటి ఆశలతో పంటలు సాగు చేసిన రైతులకు వరద కష్టాలు తప్పలేదు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టగా.. పత్తి చేలు బురద, ఇసుక మేటలతో దర్శనమిస్తున్నాయి. వారం రోజులకు పైగా వరద నీటిలో మునిగి ఉన్న పత్తి మొక్కలు కుళ్లిపోయాయి. సాధారణ ఎదిగిన పత్తి మొక్కలు మూడు రోజులు నీటిలో ఉంటేనే కుళ్లిపోతాయి. ఎదిగే దశలోనే ఉన్న పత్తి మొక్కలు వరద ప్రభావానికి తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరానికి పత్తి సాగుకు ఇప్పటివరకు రూ.16 వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక విత్తనాలు రెండు, మూడుసార్లు నాటాల్సి వచ్చింది. గతంలోనూ వరదలు వచ్చినా వర్షాకాలం ఆరంభంలో వచ్చిన సందర్భాలు లేవు. అలాగే వారం రోజులపాటు వరద చేలలోనే నిలిచి ఉన్న సందర్భాలు సైతం చాలా తక్కువ. ప్రస్తుత వరదలతో పంటను కాపాడుకోలేకపోయామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరి నారుమడులు సైతం కుళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మండలాల్లోనే నష్టం..

ప్రాణహిత నది వరదలతో సిర్పూర్ నియోజకవర్గంలోని దహెగాం, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) మండలాల్లోనే నష్టం అధికంగా సంభవించింది. ఇక్కడ ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. వరి ఇంకా నాట్ల దశలోనే ఉండగా.. పత్తి పంట మొక్కలు ఎదిగే దశలో ఉన్నాయి. నది ఉధృతితో వరద పంట భూముల్లో నిలిచింది. వారం రోజులుగా పంటలు నీటిలోనే మునిగి ఉన్నాయి. బెజ్జూర్ మండలంలో 1500 ఎకరాలు, దహెగాంలో 1880, పెంచికల్‌పేట్‌లో 850, చింతలమానెపల్లి మండలంలో 590 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే రైతులకు పరిహారం అందక అప్పుల పాలవుతున్నారు. మళ్లీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోళ్లు వారికి భారంగా మారుతున్నాయి.

ఏటా నష్టం



ప్రాణహిత ఉప్పొంగి ఐదెకరాల పత్తి పంట పూర్తిగా బురదమయంగా మారింది. దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు పెట్టిన. వరద పంటను పొట్టన పెట్టుకుంది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలి.

– పనేం రాములు, తలాయి, మం.బెజ్జూర్

పంట సర్వనాశనం



నాలుగెకరాల పత్తి పంట భారీ వరదలు రావడంతో సర్వనాశనమైంది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి. రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. ఈ ఏడాదైనా కొంత పంట చేతికందుతుందని అనుకున్నా..

– దుర్గం సాంబయ్య, మురళీగూడ, మం.పెంచికల్‌పేట్

పరిహారం ఊసేది..?



వర్షాలకు ప్రాణహిత, పెద్ద వాగు ఉప్పొంగి పంటలు నష్టపోతున్నాం. అధికారులు సర్వే చేసి చేతులు దులుపుకొంటున్నారు. ప్రభుత్వం తరఫున ఒక్క రూపాయి అందలేదు. నష్టపరిహారం ఊసే లేదు.

– అశోక్, మొట్లగూడ, మం.దహెగాం

పంటలు నీట మునిగాయి



మా గ్రామంలో వందల ఎకరాల పత్తి, వరి పంటలు నీట మునిగిపోయాయి. పంటను కాపాడుకోలేని పరిస్థితి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మాకు దిక్కు లేకుండా పోయింది. పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి.

– డోకె తిరుపతి, దిందా, మం.చింతలమానెపల్లి

ఆందోళనలో ఉన్నాం



ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నా. నాన్నకు తోడుగా పత్తి సాగు చేస్తున్నా. వరదల్లో రెండెకరాల పత్తి పంట కుళ్లిపోయింది. మళ్లీ పంట సాగు చేసే ఆశ లేదు. పంట దెబ్బతిని ఆందోళనలో ఉన్నాం.

– రమాకాంత్, దిందా, మం.చింతలమానెపల్లి

ప్రాణాలు తీస్తున్న పాములు

- ఉమ్మడి జిల్లాలో మరణాలు
- ఐదేళ్లలో ఆసిఫాబాద్‌లోనే అధికం
- నాటు వైద్యం, చికిత్సలో జాప్యం
- వానాకాలంలో అప్రమత్తత అవసరం

గత రెండేళ్లలో..

జిల్లా	పాముకాట్లు
మంచిర్యాల	09
నిర్మల్	24





ఖానాపూర్: గోసంపల్లె గ్రామంలో పాముకాటుకు మృతిచెందిన అరుగుల గంగమ్మ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పాముకాటు మరణాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏటా వర్షాకాలంలోనే అధికంగా పాములు కాటేస్తుండగా.. కొన్ని చోట్ల బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. చాలాసార్లు ప్రమాదం నుంచి బయటపడుతున్నా కొన్నిసార్లు ప్రాణముప్పు తప్పడం లేదు. గత రెండ్రోజుల వ్యవధిలోనే మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఒకరు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గోసంపల్లికి చెందిన వృద్ధురాలు మృత్యువాతపడ్డారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. గత ఐదేళ్లలో 92మందికి కాటు వేయగా 15మంది చనిపోయారు.

నాటు వైద్యం

కొన్ని ప్రాంతాల్లో పాముకాటు బాధితులు ఆస్పత్రికి వెళ్లడం కంటే మంత్రాలు, తాయత్తులు, చెట్ల ఆకులు, రాళ్ల వైద్యం నమ్ముతున్నారు. కాటేసిన పాములు విషపూరితం కాకపోతే ఎలాంటి ఇబ్బంది ఉండదు. విషసర్పాలు అయితే తప్పనిసరిగా చికిత్స చేయాలి. పాలివీనం, యాంటీ వీనమ్ ఇవ్వాల్సి ఉంటుంది. చికిత్స తీసుకోవడంలో జాప్యంతోపాటు నాటువైద్యంపై నమ్మకంతో నష్టం జరుగుతోంది.

వానాకాలంలో అధికం

వర్షాకాలంలో పాములపుట్టలు, రంధ్రాల్లో నీరు నిండి విషపురుగులు బయటకు వస్తుంటాయి. ఇంటి పరిసరాలు, వ్యవసాయ భూములు, ఇతర ప్రదేశాల్లో అధికంగా సంచరిస్తుంటాయి. ఉమ్మడి జిల్లాలో నాగుపాము, కట్లపాము, రక్తపింజర, చిన్న రక్తపింజర వంటి విషపూరిత పాములతోపాటు విషరహిత రకానికి చెందిన సరీసృపాలు ఉన్నాయి. పాములు కాటేసినప్పుడు వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

అందుబాటులో ఇంజక్షన్లు

ఉమ్మడి జిల్లాలోని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. సరిపడా నిల్వ అన్ని చోట్ల ఉందని, ఎక్కడైనా కొరత ఉన్నా వెంటనే సర్దుబాటు చేస్తున్నామని తెలుపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంకా కొందరు నాటు వైద్యం పైనే నమ్మకంతో ఆసుపత్రికి రావడంలో జాప్యం చేయడంతో మరణాలు సంభవిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తత అవసరం..

అపరిశుభ్ర పరిసరాలతో ఎలుకలు, కప్పలు, పురుగులు వస్తే వాటిని వేటాడి తినేందుకు పాములు వస్తాయని నిపుణలు చెబుతున్నారు. వీలైనంత వరకు చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. రాత్రివేళ, అడవుల్లో సంచరిస్తే బూట్లు వేసుకోవాలి. పాములు కనిపిస్తే శబ్దాలు చేస్తే అక్కడి నుంచి వెళ్లిపోతాయి. పాము కరిస్తే గాయం పెద్దదా, చిన్నదా గుర్తించాలి. ఆ భాగాన్ని ఎటూ కదల్చకుండా జాగ్రత్త పడాలి. ఇలా చేస్తే విషం శరీరంలో మరోచోటికి వ్యాప్తి చెందకుండా కొంతసేపు నిలువరించవచ్చు. కాటేసిన చోట నొక్కుతూ విషం, రక్తం బయటకు వచ్చేలా చూడాలి. ఆందోళన చెందకుండా వీలైనంత త్వరగా ఆస్పత్రికి వెళ్లాలి. ఒత్తిడికి గురైతే రక్తపీడనం పెరిగి నరాల ద్వారా మెదడుకు విషం చేరే ప్రమాదం ఉంది. బాధితులకు ధైర్యం చెబుతూ తగినంత గాలి ఆడేలా చూడాలి. ఏ పాము కాటేసిందో గుర్తిస్తే విరుగుడు చికిత్స సులువు అవుతుంది.

చాలా పాములు విషం లేనివే..

పాముల్లో చాలా వరకు విషం లేనివే ఉన్నాయి. పాములు మనుషుల అలికిడి వింటే దూరంగా వెళ్లిపోతాయి. వాటికి ముప్పు అని భావిస్తే ఆత్మరక్షణకోసం కాటు వేస్తాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి నష్టం జరగదు. మా సొసైటీ తరఫున గిరిజన ప్రాంతాల్లో పాముల సంచారం, వాటి తీరుపై అవగాహన కల్పిస్తాం.

– అవినాశ్, సెక్రెటరీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్‌సొసైటీ, హైదరాబాద్

ప్రణాళికాబద్ధంగా రుణమాఫీ అమలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- రెండో విడతలో 14,623 మందికి లబ్ధి




మహిళా రైతుకు చెక్కు ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్: రైతు రుణమాఫీ పథకాన్ని జిల్లాలో ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. రెండోవిడత రైతు రుణమాఫీలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర రుణాల మాఫీని మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పలువురు జిల్లా రైతులకు రుణమాఫీ చెక్కులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత రైతు రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాలో 14,623 మంది రైతుల ఖాతాల్లో రూ.153,34,94,379 నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధులను ఏకమొత్తంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. బ్యాంకుల్లో రద్దీ లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఎస్‌బీఐ శాఖల్లో రైతుల ఖాతాలు అధికంగా ఉన్నాయని, అధికారులు ప్రణాళికాబద్ధంగా నగదు చెల్లింపులు చేపట్టాలన్నారు. రైతులకు సమాచారం అందించేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం, మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. సాంకేతిక సమస్య తలెత్తితే ఏఈవో కార్యాలయంలో పరిశీలించుకోవాలన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం రూ.153 కోట్ల రుణమాఫీ చెక్కును అధికారులతో కలిసి ఐదుగురు రైతులకు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కరెంట్ ఉంటేనే రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేయని ఇన్వర్టర్లు
- మొరాయిస్తున్న కంప్యూటర్లు
- రెండు నెలలుగా దరఖాస్తుదారులకు తప్పని ఇబ్బందులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్వర్టర్లు పని చేయడం లేదు. రెండు నెలలుగా కార్యాలయంలో ఇదే పరిస్థితి ఉండటంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు అవస్థలు పడుతున్నారు జిల్లాలోని 15 మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఇక్కడికి వస్తుంటారు. బ్యాటరీ సమస్యలతోపాటు ఇతర సాంకేతిక కారణాలతో వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కార్యాలయంలోని ఇన్వర్టర్ బ్యాటరీ ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరా ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నెల రోజులుగా స్టాంపు కౌంటర్ కంప్యూటర్‌తోపాటు శనివారం నుంచి బయోమెట్రిక్ మిషన్ పనిచేయడం లేదు. తాజాగా మంగళవారం రిజిస్ట్రేషన్ కంప్యూటర్ మొరాయించింది. రెబ్బెన, కాగజ్‌నగర్, కౌటాలతోపాటు జమ్మికుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో నిరీక్షించి వెనుదిరిగారు. అధికారుల నిర్లక్ష్యంతోనే విలువైన సమయంతోపాటు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తప్పని నిరీక్షణ

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. శనివారం ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఆది, సోమవారం సెలవు కాగా.. మంగళవారం మరో 13 మంది రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు స్టాంపులు, లోన్ టికెట్లు, ఈసీ కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. రెండు నెలలుగా కంప్యూటర్లు, బ్యాటరీ సమస్య ఉంది. ఉన్నతాధికారులకు నివేదించినప్పటికీ చర్యలు లేవని సిబ్బంది వాపోతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి. అధికారులు వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అశోక్‌ను సంప్రదించగా.. రెండు నెలలుగా కంప్యూటర్, బ్యాటరీలు పని చేయడం లేదని, తాను ఇటీవల కొత్తగా విధుల్లోకి చేరానని స్పష్టం చేశారు. కంప్యూటర్ పని చేయకపోవడంతో సాఫ్ట్‌వేర్ వేరే కంప్యూటర్‌లోకి అప్‌డేట్ చేస్తున్నామని, బుధవారం నుంచి రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిబ్బంది బదిలీ

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని పూర్తి సిబ్బందిని ఇటీవల బదిలీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ లాంగ్ లీవ్‌లోకి వెళ్లగా.. ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కొత్తగా ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండర్ జిల్లాకు బదిలీపై వచ్చారు. మంగళవారం ముగ్గురు సిబ్బందిలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ మాత్రమే విధులకు హాజరయ్యారు. సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉండడంతో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ అశోక్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

క్లుప్తంగా

ఫిట్స్‌తో యువకుడు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

తాండూర్: ఫిట్స్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన తాండూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు శివాజీనగర్‌కు చెందిన ఉప్పట్ల శ్రీకాంత్ (24) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. సోమవారం పంటపొలానికి వెళ్లగా ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



రాంకీ (ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి లోని ఇటిక్యాలకు చెందిన చిలుక రాంకీ (26) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రాంకీ మంగళవారం ఉదయం ఇటిక్యాల సమీపంలోని మద్రిగూడకు చెందిన కళ్యాణ్ అనే రైతు వ్యవసాయ భూమిలోని మోటారుకు వచ్చే విద్యుత్ స్తంభం పైన వైరుకు కార్బన్ రావడంతో పోల్ ఎక్కి మరమ్మతు చేస్తుండగా పైనున్న 11 కేవీ విద్యుత్‌వైర్లు చేతికి తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని సీఐ నరేందర్ పరిశీలించారు. మృతుని తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టోర్ రూమ్‌గా మారిన సులభ్ కాంప్లెక్స్

చెన్నూర్: స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా చెన్నూర్ మున్సిపల్ కార్యాలయంలో రూ.4.27 లక్షల నిధులతో సులభ్ కాంప్లెక్స్ నిర్మించి ఏడాది కావస్తున్నా నేటికీ తెరుచుకోలేదు. దీంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ స్టోర్ రూమ్‌గా మారింది. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది వస్తుంటారు. సిబ్బందితో పాటు మెప్మా సభ్యురాళ్లు, ఆశ వర్కర్లు, కౌన్సిల్ సభ్యులు సుమారు వందకు పైగా ఉన్నారు. వివిధ అసరాల కోసం వచ్చే వారంతా బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి నెలకొంది. పాలకవర్గ సభ్యులు, అధికారులు స్పందించి నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అతిగా మాత్రలు వేసుకుని వృద్ధురాలు మృతి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోపవాడకు చెందిన గోపె చంద్రమ్మ (88) అనే వృద్ధురాలు అతిగా మాత్రలు వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మృతురాలు కొంతకాలంగా కడుపులో మంట, ఆయాసంతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్లడంతో వైద్యులు మందులు ఇచ్చారు. సోమవారం రాత్రి మాత్రలు ఎక్కువగా వేసుకోవడంతో అపస్మారకస్థితిలోకి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు గౌరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

- పథకంతో సంస్థకు పెరిగిన ఆదాయం
- గణనీయంగా పెరిగిన మహిళా ప్రయాణికులు



ఆర్టీసీ బస్సులో జీరో టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్న విద్యార్థినులు (ఫైల్)



ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు, విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్‌:గతంలో ప్రయాణికులు లేక వెలవెలబోయిన ఆర్టీసీ బస్సులు నేడు కళకళలాడుతున్నాయి. మహిళా ప్రయాణికులను గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల కోసం ప్రత్యేకంగా సీట్ల కేటాయింపు ఉంది. అయితే వారికి కేటాయించిన సీట్లే కాకుండా బస్సులో 90 శాతం వరకు ప్రస్తుతం మహిళలే ప్రయాణిస్తుండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అందించాలని నిర్ణయించింది. వయసుతో సంబంధం లేకుండా బాలిక నుంచి వృద్ధురాలి వరకు ప్రతి ఒక్కరూ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో ప్రజా రవాణా సంస్థకు మహిళా ప్రయాణికుల తాకిడి పెరగడంతోపాటు, ఆదాయం సైతం పెద్ద మొత్తంలో సమకూరుతోంది.

నిర్మల్ టాప్..

మహాలక్ష్మి పథకం వినియోగానికి సంబంధించి రీజియన్ వ్యాప్తంగా పరిశీలిస్తే నిర్మల్ డిపోలో అధికంగా లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై 21 వరకు 1.48 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు 51.59 లక్షల మంది ఉండగా జీరో టిక్కెట్ తీసుకున్న మహిళలు 96.54 లక్షల మంది ఉన్నారు. దాదాపుగా రెట్టింపు సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇక మంచిర్యాలలో 78 లక్షలు, ఆదిలాబాద్‌లో 59 లక్షలు, భైంసాలో 56 లక్షలు, ఆసిఫాబాద్‌లో 49, ఉట్నూర్ పరిధిలో 16 లక్షల మంది అతివలు, బాలికలు ప్రయాణం చేశారు. ఇక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) విషయానికి వస్తే భైంసా డిపోలో అధికంగా 96 శాతం, నిర్మల్‌లో 94 శాతం, ఆసిఫాబాద్‌లో 89 శాతం, మంచిర్యాలలో 88 శాతం, ఆదిలాబాద్‌లో 86 శాతం, ఉట్నూర్‌లో 85 శాతంగా ఓఆర్ నమోదైంది. రీజియన్ పరిధిలో మొత్తంగా 90 శాతం ఓఆర్ నమోదు కావడంతో 'మహాలక్ష్మి ఎఫెక్ట్' అని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

బస్సుల కోసం మరిన్ని విజ్ఞప్తులు..

మహాలక్ష్మి పథకం ప్రారంభం కావడంతో పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. గతంలో బస్సులు నిలిపివేసిన రూట్లలో సైతం బస్సులు పునరుద్ధరించాలని డిమాండ్లు వస్తున్నాయి. అదేవిధంగా నూతన మార్గాల్లోనూ సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం విన్నవిస్తున్నారు. దీంతో ఈ దిశగా బస్సుల సంఖ్య పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 2023 డిసెంబర్ 15 నుంచి 2024 జూలై 21 వరకు వచ్చిన ఆదాయం

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)	జీరో టికెట్ ఆదాయం (రూ.కోట్లలో)	టికెట్ తీసుకోవడంతో వచ్చిన ఆదాయం(రూ.కోట్లలో)
ఆదిలాబాద్	6.19	2.18	4.39
ఆసిఫాబాద్	4.21	1.66	2.81
భైంసా	3.20	1.74	1.61
మంచిర్యాల	7.44	3.00	4.90
నిర్మల్	7.78	3.43	4.92
ఉట్నూర్	1.36	52 లక్షలు	88 లక్షలు
మొత్తం	30.20	12.55	19.53

ఇబ్బందులు లేకుండా చర్యలు



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రతీ వందమందిలో 55 మంది మహిళలే ఉంటున్నారు. రద్దీ, విజ్ఞప్తులు ఉన్న రూట్లలో ఉన్న బస్సు సర్వీసులను అడ్జస్ట్ చేస్తూ నడుపుతున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రధానమైన రూట్లలో బస్సులు రద్దు చేయకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బస్సుల్లో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. బస్సులు ఎక్కి, దిగేటప్పుడు హడావుడి పడకుండా నెమ్మదిగా వ్యవహరించాలి.

– సోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- 1100 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతోంది. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ ఎగ్గడి భాస్కర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిఘా పెట్టారు. మహారాష్ట్రలోని బల్లార్షకు చెందిన ఎస్‌కే రిజ్వాన్ ఉదయం రైల్వేస్టేషన్‌కు వచ్చి మంచిర్యాలకు చెందిన భూక్య సారయ్య అలియాస్ సాయి, హమాలివాడకు చెందిన అల్మేకర్ శ్యామ్, వెంకటేష్‌కు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

20 గ్రాములకు రూ.200

మహారాష్ట్రకు చెందిన రిజ్వాన్ వద్ద వెంకటేష్, శ్యామ్, సారయ్య కిలో గంజాయిని రూ.16 వేలకు కొనుగోలు చేసి 20 గ్రాముల చొప్పున ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200లకు మంచిర్యాల, శ్రీరాంపూర్, సీసీసీ, నస్పూర్ ప్రాంతాల్లోని యువకులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల ఫోన్లను పరిశీలించగా చాలామంది గంజాయి సేవించే వారి కాంటాక్ట్ నంబర్లను గుర్తించారు. అందరిపై నిఘా ఉంచాలని డీసీపీ ఆదేశించారు. కాగా ఆల్మేకర్ శ్యామ్‌పై గతంలో రెండు సార్లు పీడీ యాక్ట్ నమోదు కావడం గమనార్హం.

జపాన్ సకురా సైన్స్ ప్రోగ్రాంకు ఎంపిక



విద్యాసింగ్‌ను అభినందిస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: జపాన్ సకురా ఇంటర్నేషనల్ సైన్స్ ప్రోగ్రాంకు మంచిర్యాల కేజీబీవీ విద్యార్థి విద్యాసింగ్ ఎంపికైంది. ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి అవార్డు విజేతలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో 33 జిల్లాల నుంచి పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ చూపిన నలుగురిని ఎంపిక చేశారు. మంచిర్యాల జిల్లా నుంచి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యాసింగ్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచింది. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జపాన్ సకురా సైన్స్ ఎక్సైంజ్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా విజ్ఞానిక శాఖ డైరెక్టర్ రమేశ్ అభినందించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

తాండూర్: మండలంలోని బెజ్జాలలో ఓ ఇంటి పెరటితోటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మాదారం ఎస్సై బి.సౌజన్య తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని కొట్నాక కేశవరావు తన ఇంటి ఆవరణలోని పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి మొక్కలు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మత్తుకు బానిసైన కేశవరావు తాను తాగేందుకు, ఇతరులకు అమ్మేందుకు పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్సై వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారి తస్వీర్ పాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వారంలో కూరగాయల స్టాల్స్ అప్పగింత

బెల్లంపల్లి: పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల స్టాల్స్‌ను వారంలోగా అర్హులైన వ్యాపారులకు అప్పగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల విక్రయదారుల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. 108 మందికి స్టాల్స్ ప్రథమ ప్రాధాన్యతగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మిగతా వ్యాపారులకు రెండో ప్రాధాన్యత కింద అందజేయడం జరుగుతుందని వివరించారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

పాతమంచిర్యాల: మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, క్రైస్తవుల మనోభావాలు కించపరుస్తున్న యూ ట్యూబ్ చానళ్లను నిలిపివేయాలని జిల్లా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సామ్యూల్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బైబిల్, క్రైస్తవ మతాన్ని విమర్శిస్తూ, క్రైస్తవులను కించపరుస్తూ ప్రసారాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏసుదాస్, టీపీఎఫ్‌టీ అధ్యక్షుడు మాథ్యూ, జనరల్ సెక్రెటరీ జోషి, కోఆప్షన్ సభ్యులు అనిల్‌కుమార్, ముత్తినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బత్తుల రాంబాయి (87) కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

జన్నారం: ఆగస్టు 9, 10 తేదీల్లో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండుకూరి రాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా అనేక పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. మాదిగ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఎస్సీ వర్గీకరణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజలింగు, ఖానాపూర్ ఇన్‌చార్జి ప్రశాంత్, మండల ఇన్‌చార్జి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో వాటా 35 శాతం చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్: గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్కే7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి అందులో నుంచి 35 శాతం కార్మికులకు చెల్లించాలన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలలు కావస్తున్నా యాజమాన్యం ఇప్పటికీ గుర్తింపు పత్రం ఇవ్వడంలో జాప్యం చేస్తోందన్నారు. గుర్తింపు పత్రం లేకపోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఏరియా, కార్పొరేట్ స్థాయి స్ట్రక్చర్ సమావేశాలు కూడా జరగడంలేదన్నారు. సింగరేణికి రావాల్సిన రూ.27 వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, ఏరియా కార్యదర్శి మారెపల్లి సారయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు బీర రవీందర్, ఆకుల లక్ష్మణ్, సహాయ కార్యదర్శి బరికెల ప్రతాప్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పారుపల్లి రాజేందర్, చంద్రశేఖర్, రాజశేఖర్, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో ఆదర్శంగా నిలిచిన ఆర్కే 5



అవార్డుతో జీఎం, ఇతర అధికారులు

శ్రీరాంపూర్: రక్షణలో ఆర్కే 5 గని ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిందని శ్రీరాంపూర్ జీఎం సంజీవ రెడ్డి అన్నారు. ఇటీవల మైన్స్ సేఫ్టీ అవార్డు గెలుచుకున్న సందర్భంగా మంగళవారం గనిపై ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణలో జాతీయస్థాయి అవార్డు పొందడం హర్షించదగిందన్నారు. ఉద్యోగులు, అధికారులు ఎస్‌ఓసీలను పాటించడం వల్లే ఈ అవార్డు దక్కిందన్నారు. ఇక ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్ గౌడ్, ఏఐటీయూసీ ఏరియా సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి, పిట్ సెక్రటరీ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరికిన ముగ్గురి రిమాండ్



నిందితులతో అటవీశాఖ అధికారులు

వాంకిడి: మండలంలోని గణేశ్‌పూర్ బీట్ అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వో(రేంజర్) అప్పలకొండ తెలిపారు. గణేశ్‌పూర్ అటవీ ప్రాంతంలో సుమారు 50 టేకు చెట్లు నరికి వేయడంతో అధికారులు సమీప గ్రామాల్లో దర్యాప్తు చేపట్టారు. అనుమానితులుగా ఉన్న బైపటార్ గ్రామానికి చెందిన అజార్ మహ్మద్, ముజ్జు, గోవింద్ ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించగా చెట్లు నరికే యంత్రాలు లభ్యమయ్యాయి. దీంతో ఆ ముగ్గురు వ్యక్తులను నిందితులుగా గుర్తించి ఈ నెల 26న సిర్పూర్(టి) కోర్టులో హాజరుపర్చగా నేరం రుజుకు కావడంతో 14 రోజుల రిమాండ్ విధిస్తూ మంగళవారం కోర్టు ఇచ్చింది. ఈ మేరకు ఎఫ్ఎస్‌వో సత్యనారాయణ, ఎఫ్‌బీవో ఉమారాణి ఆధ్వర్యంలో నిందితులను ఆసిఫాబాద్ జైలుకు తరలించారు.

ఉపాధిహామీ పని దినాలు పెంచాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించి రోజువారీ కూలీ రూ.700 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కెపల్లి బాపు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీసీ మాణిక్యం మంగళవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వేసవికాలంలో పనిచేసిన కూలీలకు అలవెన్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలని, పేదలకు ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.6 లక్షలు మంజూరు చేయాలని అన్నారు. ఇంటి స్థలం ఉన్న వ్యవసాయ కార్మికులు, కూలీలకు రూ.6 లక్షలు కేటాయించాలన్నారు. ఆసరా పింఛన్ రూ.4వేలు అందజేయాలన్నారు. పేదలందరికీ రేషన్‌కార్డులు అందజేయాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేదరి దేవవరం, జిల్లా సహాయ కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, సీపీఐ బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి రత్నం రాజం, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు

- సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ



లేఖను ప్రదర్శిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్‌లో తాము అధికారంలోకి వస్తే 4 నెలల లోపే బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు పెంచుతూ ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తామని ప్రకటించి మేనిఫెస్టోలో పెట్టారన్నారు. అధికారం చేపట్టి 6 నెలల కాలం గడిచినా బీసీ కులగణన, రిజర్వేషన్‌ల అమలుపై దాటవేసే ధోరణి అవలంభిస్తోందన్నారు. బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వం కులగణన చేపట్టి స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు జంబోజు శ్రీనివాస్, కరుణాకర్, భీంసేన్, శ్రీపతి రాములు, రమేశ్, పాల్గొన్నారు.

విభునాయర్‌ను కలిసిన కోట్నాక తిరుపతి

దండేపల్లి: ట్రైబల్ అఫైర్స్ సెక్రటరీ విభునాయర్‌ను మంగళవారం తెలంగాణ గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన అభివృద్ధికి కావాల్సిన కొన్ని ప్రతి పాదనలను ఆయనతో చర్చించినట్లు తెలిపారు. వాటిపట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో గిరిజనులు చేపట్టే కార్యక్రమాల్లో విభునాయర్ పాల్గొంటానని చెప్పడం జరిగిందన్నారు.

ఒకరిపై కేసు నమోదు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లో శీలం పోచయ్యకు చెందిన మూడెకరాల భూమిని శ్రీనివాస్ అక్రమంగా పట్టా చేసుకున్నాడని కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. తన వదిన బాయక్క పేరు మీద ఉన్న 11 ఎకరాల భూమి శ్రీనివాస్ పట్టా చేసుకున్నాడని, అందులో నుంచి తన తండ్రి సంపాదించిన మూడెకరాల భూమి తనకు వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై ఆర్‌ఐ కిషన్‌రావును వివరణ కోరగా సంబంధిత భూవివాదంపై ఫిర్యాదులు అందాయని బాధిత కుటుంబసభ్యులు ఈభూమిపై ఇప్పటికే కోర్టులో కేసు వేశారని, తుది తీర్పు వస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

కేకే5 గనిలో కార్మికునికి గాయాలు

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే-5 గనిలో మంగళవారం ఉదయం షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ప్రేమ్‌సాయి అనే కార్మికుని చేతి వేలికి తీవ్ర గాయమైంది. గని లోపలి నుంచి ఉపరితలం వచ్చిన టబ్బులోని మోటర్ సామాగ్రిని అన్‌లోడ్ చేస్తుండగా అనుకోకుండా టబ్బుకు, మోటర్‌కు మధ్య కార్మికుని ఎడమ చేతి మధ్యవేలు ఇరుక్కుపోవడంతో కొంతభాగం కట్టయ్యింది. వెంటనే ఏరియా సింగరేణి డిస్పెన్సరీకి, అనంతరం రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన కత్తెరపాక సృజన్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై వెంకటేష్, సిబ్బంది మధు, రమేశ్ పాల్గొన్నారు.